క్లుప్తంగా

ఖాళీలను భర్తీ చేయాలి

శాయంపేట : రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను ప్రభుత్వం భర్తీ చేయాలని డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి తిరుపతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని, పెండింగ్‌లోఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి చిరంజీవి, నాయకులు వరుణ్, హరీష్, ఖలీల్, అయాన్, విజయ్, మనోజ్, భరత్ పాల్గొన్నారు.

వేగంగా పోచమ్మ గుడి నిర్మాణ పనులు

శాయంపేట : మండలంలోని కొప్పుల గ్రామంలో పోచమ్మ గుడి నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. గుడి నిర్మాణ పనులను మంగళవారం ఉత్సవ కమిటీ చైర్మన్ రామిని శ్రీనివాస్, గుడి నిర్మాణ దాతలు చిన్నాల సత్యనారాయణ, తల్లి విశాలాక్షి పరిశీలించారు. ఈనెల 8న దర్వాజా ప్రతిష్ఠాపన ఉంటుందని, గ్రామ పెద్దలు, ప్రజలు హాజరు కావాలని వారు కోరారు. ఫిబ్రవరి 15,16,17 తేదీల్లో గ్రామ దేవత బొడ్రాయి ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన, పోచమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన చేయనున్నట్లు తెలిపారు. అనంతరం నిర్మాణం చేస్తున్న తాపిమేస్త్రీకి శాలువాతో సత్కరించారు. గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



నడికూడ : మండలంలోని చర్లపల్లి ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు వడ్డిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని తహసీల్దార్ నాగరాజు మంగళవారం పరిశీలించారు. మెనూ రికార్డులను, పాఠశాల వంటగదిని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ.. విద్యార్థులకు ప్రతిరోజు మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సుదర్శన్, ఉపాధ్యాయులు రవీందర్, రాజకుమార్, అంగన్‌వాడీ టీచర్ లక్ష్మి, సంధ్యా పాల్గొన్నారు.

టీటీడీ భగవద్గీత పుస్తకాల పంపిణీ




ఆత్మకూరు : మండల కేంద్రంలోని స్పెక్ట్రా హైస్కూల్‌లో మంగళవారం టీటీడీ హిందు ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో విద్యార్థులకు భగవద్గీత పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. టీటీడీ ఉపన్యాసకులు నాగబండి శివప్రసాద్, పోలు రాజేష్‌కుమార్ చేతులమీదుగా విద్యార్థులకు అందించారు. భగవద్గీత మానవుని జీవన విధానాన్ని నేర్పిస్తుందన్నారు. విద్యార్థుల్లో వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సతీష్, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలి

శాయంపేట : ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని ట్రైనీ ఎస్సై మనీష సూచించారు. మండల కేంద్రంలో మంగళవారం వాహనాల తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేని మూడు ద్విచక్ర వాహనాలు, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు సరియైన పత్రాలు కలిగి ఉండాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడపొద్దని అన్నారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించొద్దని సూచించారు. ఏఎస్సై కుమారస్వామి, సిబ్బంది క్రాంతికుమార్, శ్రీశైలం, రాజు, నవీన్, ఆసియాబేగం, లుబీనా, స్రవంతి, అమూల్య ఉన్నారు.

ఎమ్మార్పీఎస్ గ్రామకమిటీ ఎన్నిక



ఐనవోలు : మండలంలోని కక్కిరాలపల్లి గ్రామంలో ఎమ్మార్పీఎస్ గ్రామకమిటీని ఎన్నుకున్నట్లు మండల అధ్యక్షుడు చింత అశోక్ తెలిపారు. గ్రామ అధ్యక్షుడిగా అరూరి అశోక్, కోశాధికారిగా కంజర్ల రవీందర్, ఉపాధ్యక్షుడిగా కంజర్ల స్వామి, కార్యదర్శిగా బర్ల వేణు, ముఖ్య సలహాదారులుగా అరూరి బాబు, కంజర్ల తిరుపతి, కంజర్ల అజయ్, కార్యవర్గ సభ్యులుగా అరూరి మహేష్, కంజర్ల నాగరాజు, కంజర్ల ఏలియా, తూళ్ల కుమార్‌ను నియమించారు.

విద్యార్థులకు అభినందన

ఐనవోలు : ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి ఇన్‌స్పైర్, సైన్స్‌ఫేర్ పోటీల్లో మండలంలోని ఏకశిలా విద్యార్థులు ఉత్తమ ప్రదర్శన కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. కాగా ఉత్తమ ప్రదర్శన కనబరిచిన కె.జెస్సీ, ఎస్.రితీక, సాయిరాంను ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

మూలకు చేరిన 'మూడో కన్ను'

- బస్టాండ్‌లో పనిచేయని సీసీ కెమెరాలు
- పేట్రేగిపోతున్న జేబుదొంగలు
- పట్టించుకోని ఆర్టీసీ అధికారులు



పట్టణంలోని బస్టాండ్‌లో నిరుపయోగంగా ఉన్న సీసీ కెమెరా

పరకాల : నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉండే పట్టణంలోని బస్టాండ్‌లో సీసీ కెమెరాలు పనిచేయక పోవడంతో జేబుదొంగలు రెచ్చిపోతున్నారు. స్థానిక పోలీసులకు వరుసగా వస్తున్న ఫిర్యాదులే అందుకు సాక్ష్యమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మహిళలకు ఉచిత ప్రయాణాల కారణంగా ఆర్టీసీ బస్టాండ్‌కు ప్రయాణికుల తాకిడి రెట్టింపయ్యింది. దింతో నిత్యం బస్టాండ్ రద్దీగా మారుతోంది. ఇదే అదునుగా భావిస్తున్న జేబుదొంగలు రెచ్చిపోయి ప్రయాణికుల పర్సులు కొట్టివేయడంతో పాటు విలువైన వస్తువులను దోచుకోవడం, వాహనాలను సైతం మాయం చేస్తున్నారని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ఇలాంటి సమయంలో సీసీ కెమెరాలపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన ఆర్టీసీ అధికారులు తమకు ఆదాయం తప్పా ప్రయాణికుల భద్రతతో సంబంధం లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. సీసీ కెమెరాలు నిరుపయోగంగా మారడంతో దొంగల ఆగడాలకు అడ్డూఅదుపు లేకుండా పోయ్యిందని ప్రయాణికులు వాపోతున్నారు. ప్రధాన రహదారులపై ఉన్న సీసీ కెమెరాలు కూడా పనిచేయకపోవడంతో నేరాలను ఛేదించడం పోలీసులకు సవాల్‌గా మారిందనే వాదనలు వినిపిస్తున్నాయి. ఆర్టీసీ అధికారులు సీసీ కెమెరాల నిర్వహణను పట్టించుకోకపోవడంతో పోలీసులు ప్రత్యేక చొరవ చూపి స్థానిక వ్యాపారుల సహకారంతో నిర్వహణ బాధ్యత తీసుకున్నారు. రెండేళ్ల పాటు నిర్వహణ చూసుకున్నప్పటికీ సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో వారు కూడా వదిలేశారు. అయితే ఆర్టీసీ అధికారులు సహకరిస్తే సీసీ కెమెరాల మరమ్మతులకు తమవంతుగా కృషిగా చేస్తామని పోలీసులు భరోసా ఇస్తున్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రతిఒక్కరూ సహకరించాలని ఈ సందర్భంగా పోలీసులు కోరారు.



ప్రయాణికులతో కిటకిటలాడుతున్న బస్టాండ్

ఒకేరోజు రెండు దొంగతనాలు

ఇటీవల చర్లపల్లికి చెందిన ఓ వృద్ధురాలు పరకాల బస్టాండ్‌కు ఆటోలో వచ్చింది. బస్టాండ్‌కు చేరుకున్న కొద్ది సేపటికే మూడు తులాల బంగారంతో ఉన్న పర్సు కనిపించలేదు. దింతో లబోదిబోమంటూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు నిందితుల గురించి ఆరా తీస్తున్నారు. ఆటోలో మాయమైందా లేదా బస్టాండ్‌లో ఏవరైనా దొంగిలించారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. అదే రోజు మరో మహిళ పర్సును దొంగలు ఎత్తుకెళ్లారు. పర్సులో కొంత నగదుతో పాటు సెల్‌ఫోన్ ఉన్నట్లు తెలిసింది. ఒకేరోజు రెండు ఘటనలు జరగడం, సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో నిందితులను పట్టుకోవడం పోలీసులకు సవాల్‌గా మారింది.

ఆర్టీసీ అధికారులు, వ్యాపారులతో చర్చించాం



వ్యాపారుల సహకారంతో పట్టణంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పనిచేయడం లేదనే మాట నిజమే. వాటిని మరమ్మతులు చేయడమో, కొత్త కెమెరాల ఏర్పాటు చేయడమో నిర్ణయం తీసుకుంటాం. ఆర్టీసీ బస్టాండ్‌లో పనిచేయని కెమెరాలకు మరమ్మతు చేయాలని ఆర్టీసీ అధికారులను కోరాం. మేము కూడా మరోసారి వ్యాపారులతో చర్చించాం. కొద్ది రోజుల్లోనే సీసీ కెమెరాలను అందుబాటులోకి తీసుకొస్తాం.

- క్రాంతికుమార్, సీఐ, పరకాల

ఆత్మస్థైర్యమే గెలుపునకు నాంది



గెలుపొందిన దివ్యాంగులకు బహుమతులు ప్రదానం చేస్తున్న నోడల్ అధికారి సునీతారాణి



దామెర : విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి

ఎల్కతుర్తి : ఎంచుకున్న లక్ష్యాన్ని ఛేదించేందుకు దివ్యాంగం అడ్డుకాదని, ఆత్మస్థైర్యంతో ముందుకెళ్తే గెలుపు తలుపు తట్టుతుందని నోడల్ అధికారి ఎం.సునీతారాణి అన్నారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని భీమదేవరపల్లి మండల కేంద్రంలో గల భవిత కేంద్రంలో మంగళవారం దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగ విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం సమగ్ర శిక్ష అభియాన్ ద్వారా ప్రత్యేక అవసరాలు తీర్చే ఉచిత ఉపకరణాల పంపిణీ, రవాణా భత్యం, ఎస్కార్ట్ అలవెన్స్‌లు, బాలికల ఉపకార వేతనం, విలీన విద్య గురించి వివరించారు. సమగ్ర శిక్ష ద్వారా అందించే ఫిజియో థెరపీని వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్, మారుపాటి శ్రీధర్‌రెడ్డి, వేణుగోపాల్ స్వామి, నాగవంశీ, నాజు, శ్రీకాంత్, హిమాసాగర్, శాంత, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దామెరలో..

దామెర : దివ్యాంగులు అన్నిరంగాల్లో రాణించాలని ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం మండల కేంద్రంలో గల ప్రభుత్వ పాఠశాలలో దివ్యాంగ విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతుల పంపిణీ చేశారు. ఎంఈఓ రాజేష్ కుమార్ అధ్యక్షతన సమావేశం జరుగగా ఆయన పాల్గొని మాట్లాడారు. దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలని అన్నారు. సదరం సర్టిఫికెట్, పెన్షన్ మంజూరులో సమస్యలుంటే తమను సంప్రదించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, దివ్యాంగ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు నిశిధర్‌రెడ్డి

శాయంపేట : ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని జయశంకర్ భూపాలపల్లి జిల్లా బీజేపీ అధ్యక్షుడు ఏడునూతుల నిశిధర్‌రెడ్డి ఆరోపించారు. ప్రభుత్వం ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేయకపోవడాన్ని నిరసిస్తూ మంగళవారం కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి నిరుపేదలకు 6 గ్యారెంటీలు అమలు చేయకపోగా 66 అబద్ధాలతో సరిపెడుతున్నారని విమర్శించారు. సాధ్యంకాని హామీలు గుప్పించి ప్రజలను మోసగిస్తున్నారని అన్నారు. రైతు భరోసా ఇవ్వకుండా రైతులను మోసం చేస్తున్నారని, రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి రైతులు, ప్రజల చేతిలో గుణపాఠం తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో యాత్ర ప్రముక్ వెన్నంపల్లి పాపయ్య, బీజేపీ మండల అధ్యక్షుడు గడ్డం రమేశ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నాగపురి రాజమౌళిగౌడ్, పార్లమెంట్ కన్వీనర్ లింగంపల్లి ప్రసాద్‌రావు, సభ్యత్వ జిల్లా ప్రముక్ జన్ను మొగిలి, నాయకులు రాయరాకుల మొగిలి, జగ్గయ్య, తిరుపతిరావు, సయ్యద్ గాలిబ్, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నిశిధర్‌రెడ్డి

సమస్యలు పరిష్కరించే వరకు ఆందోళన

- తేల్చిచెప్పిన ఆశ కార్యకర్తలు

ఎల్కతుర్తి : సమస్యలను పరిష్కరించే వరకు ఆందోళన విరమించమని ఆశ కార్యకర్తలు తేల్చిచెప్పారు. మంగళవారం భీమదేవరపల్లి మండలం వంగర పీహెచ్‌సీ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏసీడీసీ, పల్స్‌పోలియో డబ్బులు వెంటనే చెల్లించాలని అన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పనిచేస్తున్నామని, ప్రభుత్వం రూ.18 వేలు గౌరవ వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. గతంలో చేసిన లెప్రసీ డబ్బులు ఇస్తేనే లెప్రసీ సర్వే చేస్తామన్నారు. గత మూడు సంవత్సరాలుగా చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే ప్రమాద బీమా, ఉద్యోగ భద్రతా, పీఎఫ్, ఈఎస్ఐ కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పద్మ, శోభ, జయ, విజయ, అన్నపూర్ణ, తదితరులు పాల్గొన్నారు.



పీహెచ్‌సీ ఎదుట ధర్నా చేపట్టిన ఆశ కార్యకర్తలు

సీఎంకప్ పోటీలను జయప్రదం చేయాలి



ధర్మసాగర్ : మండలంలోని అన్ని గ్రామాల్లో ఈనెల 7,8వ తేదీల్లో నిర్వహించనున్న సీఎంకప్ క్రీడా పోటీలను జయప్రదం చేయాలని ఎంపీడీఓ అనిల్‌కుమార్ కోరారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం సీఎంకప్ క్రీడా పోటీలపై సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ పోటీలు అత్యంత ముఖ్యమైనవని అన్నారు. మండల స్థాయిలో 10,11,12 తేదీల్లో జరిగే క్రీడా పోటీలను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం సీఐ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. క్రీడా పోటీలు సజావుగా జరిగే విధంగా తమవంతు సహకారం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అస్నాల శ్రీనివాస్, ఆర్ఐ కిరణ్, ఎంపీఓ అఫ్జల్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కమలాపూర్ : ఈనెల 7,8 తేదీల్లో గ్రామ స్థాయిలో, 10 నుంచి 12వ తేదీ వరకు మండలస్థాయిలో జరిగే సీఎంకప్ క్రీడా పోటీలను విజయవంతం చేయాలని ఎంపీడీఓ గుండె బాబు సూచించారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మండలస్థాయి అధికారులు, హెచ్ఎంలు, పీడీలు, పీఈటీలు, పంచాయతీ కార్యదర్శులతో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. క్రీడలు శారీరక, మానసికోల్లాసానికి దోహదపడుతాయని అన్నారు. మండలంలోని విద్యార్థినీ, విద్యార్థులు, యువతీ, యువకులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. తహసీల్దార్ సురేష్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ, ఎంఈఓ రాంకిషన్‌రాజు, ఎంపీఓ రవి పాల్గొన్నారు.

మంత్రి పదవి కోసమే మాలల ఉద్యమానికి తెర



మాట్లాడుతున్న మైస ఉపేందర్

ధర్మసాగర్ : సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తున్న చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ మంత్రి పదవి కోసమే మాలల ఉద్యమానికి తెరలేపారని మాదిగ హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మైస ఉపేందర్ మాదిగ ఆరోపించారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పదవుల కోసం పూటకో పార్టీ మారిన వివేక్.. ఇప్పుడు మాలల ఉద్యమం అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎస్సీ వర్గీకరణకు అనుకూలమని సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ప్రకటిస్తే ఆ పార్టీలో గెలిచిన ఎమ్మెల్యేలు వివేక్, నాగరాజు వ్యతిరేకించి మాలలను రెచ్చగొట్టడం ఏంటని ప్రశ్నించారు. వెంటనే వారిని పార్టీని నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని, లేనిపక్షంలో మాదిగల సత్తా ఏంటో ప్రభుత్వానికి చూపిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎంహెచ్‌పీఎస్ శ్రేణులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

పత్తిసాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



ఐపీఎం కిట్లు పంపిణీ చేస్తున్న అధికారులు

దామెర : పత్తి పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ కేంద్రం అసిస్టెంట్ ప్లాంట్ ప్రొటెక్షన్ అధికారి హోన్నప్పగౌడ్ అన్నారు. మండలంలోని పులుకుర్తిలో రైతులకు సమగ్ర సస్యరక్షణ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పురుగు గుడ్లపై వేపనూనె పిచికారి చేయాలని అన్నారు. రెక్కపుగుల నివారణ కోసం చేనులో లింగాకర్షన బుట్టలు, జిగురు అట్టలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందే విధంగా రైతులు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఏఓ రాకేష్, ప్లాంట్ ప్రొటెక్షన్ ఆఫీసర్ వెంకట్‌రెడ్డి, అసిస్టెంట్ ప్రొటెక్షన్ అధికారి ఉదయ్‌శంకర్, అసిస్టెంట్ ప్లాంట్ ప్రొటెక్షన్ అధికారి బసవన్నప్ప, ఏఈఓ రామకృష్ణ, రైతు సంఘం అధ్యక్షుడు లక్ష్మణ్, రాంబాబు పాల్గొన్నారు.

హక్కుల సాధనకు పోరాటం తప్పదు

ఐనవోలు : కల్లుగీత కార్మికుల హక్కుల సాధనకు పోరాటం చేయాలని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గౌని సాంబయ్య గౌడ్, బుర్ర శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని వెంకటాపురం గ్రామంలో సొసైటీ మండల అధ్యక్షుడు బత్తిని నాగరాజు గౌడ్ అధ్యక్షతన కమ్యూనిటీ హాల్‌లో మండలస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కల్లుగీత కార్మిక సంఘం ఉద్యమ ఫలితంగానే పెన్షన్ పెంపు, సేఫ్టీ మేకులు వచ్చాయన్నారు. గీత కార్మికుల ప్రధాన సమస్యలైన 5 ఎకరాల భూమి, రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా, జిల్లాలో నీరా ప్రాజెక్టులు, గీత కార్మికులకు తగిన బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. సంఘం పిలుపునిస్తే కార్మికులు తక్షణమే స్పందిచాలని కోరారు. అనంతరం నూతనంగా ఎన్నికైన జిల్లా కమిటీ సభ్యుడు కారింగుల రవిగౌడ్, మండల ప్రధాన కార్యదర్శి గట్టు కార్తీక్ గౌడ్‌ను మండల కార్యవర్గం సన్మానించింది. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సొసైటీ అధ్యక్షులు మడ్డి శేఖర్, మునిగాల వెంకటేశ్, మునిగాల శ్రీనివాస్, బుర్ర సురేందర్, మండల కుమారస్వామి, వల్లాల నాగయ్య, మడ్డి దేవేందర్, మోడెం కృష్ణమూర్తి, గట్టు మల్లయ్య, దూసరి చేరాలు, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, వెంకటేశ్, రమేశ్ పాల్గొన్నారు.



నూతన జిల్లా కమిటీ సభ్యులను సన్మానిస్తున్న గౌడ సంఘం నాయకులు

మూగజీవాల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

దామెర : మూగజీవాల ఆరోగ్యంపై యజమానులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని మండల పశువైద్యాధికారి దీపిక అన్నారు. పశుగణాభివృద్ధి, పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మండలంలోని తక్కళ్లపహాడ్‌లో మంగళవారం పశువులకు ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాన్ని నిర్వహించారు. 32 పశువులకు గర్భకోశ వాధ్యలకు చికిత్స నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. పాడి పశువులు యదకు వచ్చినప్పుడు గుర్తించి లింగనిర్ధారిత ఇంజక్షన్ చేయించాలని అన్నారు. తద్వారా మేలు జాతి ఆడదూడలు వృద్ధి చెందుతాయని వెల్లడించారు. గోపాలమిత్ర సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వీఎల్ఓ లక్ష్మణ్, గోపాలమిత్ర సూపర్‌వైజర్ ప్రకాశ్ రెడ్డి, గోపాలమిత్రలు మధుకర్, సుమన్, గ్రామ పాడిరైతులు తదితరులు పాల్గొన్నారు.



తక్కళ్లపహాడ్‌లో చికిత్స చేస్తున్న దీపిక

రాజేందర్‌కు ప్రశంసపత్రం



శాయంపేట : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో దివ్యాంగులకు అత్యధిక పనిరోజులు కల్పించినందుకు మైలారం గ్రామపంచాయతీ కార్యదర్శి గందె రాజేందర్ ప్రశంసపత్రం అందుకున్నారు. మంగళవారం హనుమకొండలోని అంబేడ్కర్ భవన్‌లో మైలారం పంచాయతీ కార్యదర్శి గందె రాజేందర్, ఫీల్డ్ అసిస్టెంట్ అరికిల్ల సుమన్‌కు డీఆర్డీఓ శ్రీనివాస్ చేతుల మీదుగా ప్రదానం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో పాటు పంచాయతీ సిబ్బంది వారిని అభినందించారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

- ఎఫ్ఎంఎం డైరెక్టర్ సహాయ

ఆత్మకూరు : మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఎఫ్ఎంఎం డైరెక్టర్ సహాయ అన్నారు. మండల కేంద్రంలో ఎఫ్ఎంఎం సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత మగ్గం వర్క్స్ శిక్షణ శిబిరాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సహాయ మాట్లాడుతూ.. సమాజంలో మహిళలు ఉన్నత స్థానానికి ఎదగాలని, మహిళా సాధికారత ఆర్థిక స్వావలంబన సాధించినప్పుడే మహిళలు పురుషులతో సమానంగా ఎదుగుతారని అన్నారు. మహిళలు స్వాయంకృషితో ముందుకెళ్లాలని, ఉపాధిని సృష్టించుకోవాలని సూచించారు. మండలంలోని మహిళలు మగ్గం వర్క్స్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రోగ్రాం కోఆర్డినేటర్ శ్రీకాంత్, మేనేజర్ అజయ్ కుమార్, మా సోషల్ సర్వీస్ సొసైటీ కార్యదర్శి శివప్రసాద్, శిక్షకురాలు మమత, మాధవి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సహాయ

జీవ పరిణామం సహజ లక్షణం



ధర్మసాగర్ : పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు



శాయంపేట : విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ధర్మసాగర్ : జీవ పరిణామం సహజ లక్షణమని జీవ శాస్త్ర ఉపాధ్యాయురాలు కవితాదేవి అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జీవ పరిణామ సిద్ధాంత ప్రచార ఉద్యమంలో భాగంగా జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మంగళవారం వైజ్ఞానిక సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మానవులు యథాతథంగా కాకుండా పూర్వీకుల నుంచి గ్రహించిన పద్ధతులను కూడా పాటించి జీవులు పరిణామం చెందడం అనేది సహజమైన లక్షణంగా గుర్తించినట్లు తెలిపారు. జీవశాస్త్రంపై విద్యార్థులు మక్కువ పెంచుకోవాలని సూచించారు. అనంతరం జనవిజ్ఞాన వేదిక తెలంగాణ రాష్ట్ర కమిటీ ప్రచురించిన చార్లెస్ డార్విన్ పరిణామ సిద్ధాంత పోస్టర్లు ఆవిష్కరించారు. వైజ్ఞానిక సదస్సు ఇన్‌చార్జ్ ధర్మప్రకాశ్ అధ్యక్షత వహించగా.. ఉపాధ్యాయులు సురేష్, పద్మజ, రాజమ్మ, కిరణ్మయి, రామకృష్ణ, ప్రసన్న, విద్యార్థులు పాల్గొన్నారు.

శాయంపేటలో..

శాయంపేట : మండలంలోని కాట్రపల్లి సీఎస్ఐ పాఠశాల విద్యార్థులు జిల్లాస్థాయి విద్య వైజ్ఞానిక ప్రదర్శనలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ రెవరెండ్ సామ్‌జార్జ్ తెలిపారు. కాట్రపల్లి గ్రామంలోని సీఎస్ఐ ఉన్నత పాఠశాల విద్యార్థులు జర్పుల చందునాయక్, వరుణ్‌సందేష్, అక్షయ్, రుత్వీక, హస్మీత, ప్రజ్వల్‌కుమార్, గైడ్ టీచర్ రాజునాయక్ సహకారంతో వైజ్ఞానిక ప్రదర్శనలో ఆరు ప్రాజెక్టుల్లో సత్తా చాటినట్లు తెలిపారు. విద్యార్థి జర్పుల చందునాయక్ ప్రదర్శన మ్యాథ్స్ కేటగిరిలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు వెల్లడించారు. ప్రిన్సిపల్ రెవరెండ్ సామ్‌జార్జ్ విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అనిల్‌కుమార్, రాజునాయక్, రాజన్న, బీజయ్, ప్రవళిక, శైలజ, ఉమ, శృతి, మోనియ, విద్యార్థులు పాల్గొన్నారు.

అమరుడా.. నీకు వందనం



ఎల్కతుర్తి : తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరుడు శ్రీకాంతచారి 15వ వర్ధంతిని భీమదేవరపల్లి మండలం ముల్కనూరులో వివిధ సంఘాల నాయకులు మంగళవారం నిర్వహించారు. స్థానిక అమర వీరుల స్తూపం వద్ద పలువురు నాయకులు శ్రీకాంతచారి చిత్రపటాని పూలమాల వేసి నివాళులర్పించారు. అమరుల త్యాగఫలితమే నేడు తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు మాట్ల వెంకటస్వామి, భిక్షపతి, అదారి శ్రీనివాస్, డ్యాగల సారయ్య, రామచంద్రారెడ్డి, ఎదులపురం తిరుపతి, స్వామి, ధర్మేందర్, రేణుకుంట్ల తదితరులు పాల్గొన్నారు.